సాక్షి
యాదాద్రి భువనగిరి
ఆదివారం : 21 : జనవరి : 2024



వైద్య రంగానికి పెద్దపీట

కేంద్రంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం వైద్య రంగానికి పెద్ద పీట వేస్తోందని కేంద్ర మంత్రి ఆర్‌కే సింగ్ పేర్కొన్నారు. - 8లో



సిబ్బంది కొరత

మోటకొండూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పూర్తిస్థాయి సిబ్బంది లేక రోగులకు వైద్య సేవలు అందడం లేదు. - 9లో



పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

మోదీ సర్కార్ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని బీజేపీ నాయకులు కోరారు. - 9లో

న్యూస్‌రీల్

పాఠశాలను సందర్శించిన కల్నల్



ఎన్‌సీసీ విద్యార్థులతో మాట్లాడుతున్న కల్నల్

ఆలేరురూరల్ : వరంగల్ పదవ బెటాలియన్ కమాండెంట్ కల్నల్ విజయానంద్ ఖండూరి శనివారం ఆలేరులోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన ఎన్‌సీసీ విద్యార్థులతో సమావేశమై మాట్లాడారు. ఎన్‌సీసీలో చేరిన విద్యార్థులకు మంచి భవిష్యత్ ఉంటుందన్నారు. విద్య, ఉద్యోగాల్లో ప్రత్యేక అవకాశాలు ఉంటాయన్నారు. అనంతరం డిజిటల్ తరగతి గదులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఎన్‌సీసీ అధికారి దూడల వెంకటేష్ ఉపాధ్యాయులు శేఖర్, సోమరాజు, హరినాథ్‌రెడ్డి, సాంబశివ, నవీన్, రవి, వేణు, విజయలక్ష్మి, కవిత, తదితరులు పాల్గొన్నారు.

నారసింహుడికి నిత్యారాధనలు



కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

యాదగిరిగుట్ట : యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహ స్వామి ఆలయంలో సంప్రదాయ పూజల్లో భాగంగా శనివారం నిత్యకల్యాణ వేడుకను వైభవంగా నిర్వహించారు. అంతకుముందు వేకువజామున ఆలయాన్ని తెరిచిన ఆచార్యులు.. శ్రీస్వామి, అమ్మవార్లకు సుప్రభాత సేవ చేపట్టారు. అనంతరం స్వయంభూ, ప్రతిష్ఠా అలంకారమూర్తులకు నిజాభిషేకం, తులసీ దళాలతో అర్చన చేశారు. ఇక ప్రథమ ప్రాకార మండపంలో శ్రీసుదర్శన నారసింహహోమం, గవాహనసేవ, నిత్యకల్యాణం, బ్రహ్మోత్సవం తదితర కైంకర్యాలు గావించారు. సాయంత్రం జోడు వసేలను మాడవీధిలో ఊరేగించారు. ఆయా పూజల్లో భక్తులు పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు.

యాదాద్రిలో సీఎంఓ కార్యదర్శి పూజలు



సీఎంఓ కార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డికి ఆశీర్వచనం చేస్తున్న అర్చకులు

యాదగిరిగుట్ట : యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహ స్వామిని సీఎంవో కార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డి శనివారం కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. గర్భాలయంలో స్వయంభూ, ప్రతిష్ఠా అలంకార మూర్తులను దర్శించుకున్నారు. అనంతరం ముఖ మండపంలో అష్టోత్తర పూజల్లో పాల్గొన్నారు. సీఎంవోకు అర్చకులు, అధికారులు ఆలయ సంప్రదాయాల ప్రకారం స్వాగతం పలికారు. వేద ఆశీర్వచనం చేసి లడ్డూ ప్రసాదం అందజేశారు.

ఆక్రమణకు గురైన ప్రభుత్వ భూమి గుర్తింపు



రికార్డులను పరిశీలిస్తున్న ఆర్డీఓ

చౌటుప్పల్ : పట్టణంలోని 113 సర్వే నంబర్‌లో ఆక్రమణకు గురైన ప్రభుత్వ భూమిని అధికారులు గుర్తించారు. 30 గుంటల భూమి ఇతరుల కబ్జాలో ఉన్నట్లు తేల్చారు. ఇందుకు సంబంధించిన వివరాలిలా.. చౌటుప్పల్ పట్టణంలోని 113, 114 సర్వే నంబర్లలో కోట్ల రూపాయల విలువజేసే ప్రభుత్వ భూమిని కొంతమంది ఆక్రమించారని ఇటీవల కాంగ్రెస్, యూత్ కాంగ్రెస్ నాయకులు సుర్కంటి వెంకట్‌రెడ్డి, తొర్పునూరి రవి ఇటీవల ఆర్డీఓ జగన్నాథరావుకు ఫిర్యాదు చేశారు. ఆర్డీఓ ఆదేశాల మేరకు రెవెన్యూ అధికారులు శనివారం 113 సర్వే నంబర్‌లో సర్వే చేశారు. 30 గుంటల భూమి ఇతరుల కబ్జాలో ఉన్నట్టుగా గుర్తించి హద్దులు ఏర్పాటు చేశారు. ప్రభుత్వ భూముల రక్షణకు చర్యలు తీసుకుంటామని ఆర్డీఓ ఈ సందర్భంగా తెలిపారు. ఇప్పటికే గుర్తించిన ఆక్రమిత భూముల్లో చేపట్టిన అక్రమ నిర్మాణాలను తొలగిస్తామన్నారు. త్వరలోనే 114 సర్వే నంబర్‌లో కూడా సర్వే చేస్తామని చెప్పారు. సర్వేయర్లు వెంకటయ్య, మురళీధర్, ఆర్‌ఐ సుధాకర్‌రావు భూమిని సర్వే చేశారు.

1676 ఎకరాల భూసేకరణ

23 గ్రామాల నుంచి సేకరించేందుకు అధికారుల కసరత్తు



రాయగిరి పరిధిలో రీజినల్ రింగ్ రోడ్డులో పోనున్న భూములు

- రీజినల్ రింగ్ రోడ్డు పనుల్లో వేగం
- నెలాఖరులోగా త్రీడీ నోటిఫికేషన్
- వివాదాలకు తావులేకుండా చర్యలు
- భువనగిరి పరిధిలోని భూములపై స్టే వెకెట్ చేయించేందుకు ప్రయత్నాలు

సాక్షి, యాదాద్రి : రీజినల్ రింగ్ రోడ్డు భూ సేకరణ ప్రక్రియలో అధికారులు వేగం పెంచారు. 23 గ్రామాల పరిధిలో 1,676 ఎకరాల సేకరణకు కసరత్తు ముమ్మరంగా జరుగుతోంది. సీఎం ఆదేశాల మేరకు కలెక్టర్ ఆధ్వర్యంలో నేషనల్ హైవే అథారిటీ, జిల్లా రెవెన్యూ అధికారులు రెండు రోజుల క్రితం సమావేశమై పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. యాదాద్రి భువనగిరి జిల్లాలో 59.33 కిలో మీటర్ల మేర రీజినల్ రింగ్ రోడ్డు నిర్మించనున్నారు. అయితే భువనగిరి పరిధిలోని రాయగిరి, ఎర్రంబెల్లి రెవెన్యూ గ్రామాల్లో భూ సేకరణకు సంబంధించి హైకోర్టు స్టే ఇచ్చిన విషయం తెలిసిందే. అయితే స్టే ఎంత భూభాగం పరిధిలోకి వస్తుందన్న విషయంపై స్పష్టత కోసం రెవెన్యూ అధికారులు శనివారం హైకోర్టును ఆశ్రయించారు. అలాగే స్టే వెకెట్ చేయించడం కోసం నేషనల్ హైవే అధికారులు కోర్టులో పిటిషన్ వేశారు. సమస్యలన్నీ కొలిక్కి తీసుకువచ్చి వివాదాలకు తావులేకుండా ఈ నెలాఖరులోగా భూసేకరణకు త్రీడీ నోటిఫికేషన్ విడుదల చేయడానికి సిద్ధం అవుతున్నారు. భూసేకరణ అధికారులుగా యాదాద్రి పరిధిలో రెవెన్యూ అదనపు కలెక్టర్ భాస్కర్‌రావు, భువనగిరి పరిధిలో ఆర్డీఓ అమరేందర్, చౌటుప్పల్ పరిధిలో ఆర్డీఓ జగన్నాథరావును ఇప్పటికే ప్రభుత్వం నియమించింది.

యాదాద్రి పరిధిలో ఇలా..

యాదాద్రి పరిధిలోని వీరారెడ్డిపల్లి నుంచి మల్లాపూర్ వరకు 19 కిలో మీటర్ల పొడవునా 504 ఎకరాలు సేకరించనున్నారు. ఇందులో కోనాపూర్, ఇబ్రహీంపూర్, దత్తాయపల్లి, వేల్పల్లి, దాతరుపల్లి గ్రామాలు ఉన్నాయి. ఇక్కడ భూ సేకరణకు సంబంధించిన ఎలాంటి వివాదాలు లేవు. రైతుల భూముల్లో ఉన్న స్ట్రక్చర్ వాల్యూ వివరాలు కూడా వచ్చాయి. ప్రస్తుతం ఉన్న రిజిస్ట్రేషన్ విలువకంటే ప్రభుత్వం మూడురెట్లు అధికంగా చెల్లించనుంది.

చౌటుప్పల్ పరిధిలో..

వలిగొండ మండలం పహిల్వాన్‌పూర్ నుంచి చౌటుప్పల్ వరకు 24 కిలో మీటర్ల దూరంలో సుమారు 11 గ్రామాల్లో 680 ఎకరాల భూమి సేకరించనున్నారు. ఇందులో చిన్నకొండూరు, నేలపట్ల, తాళ్లసింగారం, గోకారం, పహిల్వాన్‌పూర్, వలిగొండ, పొద్దటూరు, రెడ్లరేపాక, వర్కట్‌పల్లి, చౌటుప్పల్ రెవెన్యూ గ్రామాలు ఉన్నాయి.

భూసేకరణ ప్రక్రియ వేగవంతం



రీజినల్ రింగ్ రోడ్డు భూసేకరణ ప్రక్రియ వేగవంతం చేశాం. వివిదాలన్నీ పరిష్కరించి ఈనెలాఖరులోగా త్రిడీ నోటిఫికేషన్ జారీ చేస్తాం.యాదాద్రి, చౌటుప్పల్ పరిధిలో ఎలాంటి ఇబ్బంది లేదు. భువనగిరి పరిధిలో 29 మంది రైతులు హైకోర్టును ఆశ్రయించారు. ఈ విషయంలో అడ్వకేట్ జనరల్ అభిప్రాయం తీసుకుంటాం

–భాస్కర్‌రావు, అదనపు కలెక్టర్ (రెవెన్యూ)

భువనగిరి పరిధిలో..

రాయగిరి నుంచి ఎర్రంబెల్లి వరకు 15 కిలో మీటర్ల పొడవునా సుమారు 492 ఎకరాల భూమి సేకరించనున్నారు. ఇందులో రాయగిరి, కేసారం, గౌసనగర్, పెంచికల్‌పహాడ్, తుక్కాపూర్, ఎర్రంబెల్లి గ్రామాలు ఉన్నాయి. ఇందులో తుక్కాపూర్, రాయగిరికి చెందిన 29 మంది రైతులు 74 ఎకరాల భూమి విషయంలో హైకోర్టును ఆశ్రయించారు.దీంతో ప్రచురించడానికి సిద్ధంగా ఉన్న త్రిడీ నోటిఫికేషన్ నిలిచిపోయింది. ఈ విషయంలో స్టే ఎంత భూభాగం వరకు ఉందన్న దానిపై స్పష్టత కోసం అధికారులు ప్రయత్నాలు చేస్తున్నారు. కోర్టుకు వెళ్లిన రైతుల భూమి 74 ఎకరాలపై ఉందా, లేక భువనగిరి పరిధిలోని మొత్తం భూమిపై ఉందా అనే విషయంలో హైకోర్టు నుంచి స్పష్టత తీసుకుంటున్నారు.

భువనగిరి చైర్మన్ రాజీనామా

- అదే బాటలో వైస్ చైర్మన్
- అవిశ్వాసంపై 23న మున్సిపల్ ప్రత్యేక సమావేశం
- చర్చనీయాంశమైన ముందస్తు రాజీనామాలు



మున్సిపల్ కమిషనర్‌కు రాజీనామా పత్రాలు అందజేస్తున్న చైర్మన్ ఆంజనేయులు, వైస్ చైర్మన్

సాక్షి, యాదాద్రి : భువనగిరి మున్సిపల్ చైర్మన్ ఏనబోయిన ఆంజనేయులు, వైస్ చైర్మన్ చింతల కిష్టయ్య(బీఆర్‌ఎస్)లు శనివారం తమ పదవులకు రాజీనామా చేశారు. బీఆర్‌ఎస్‌తో పాటు కాంగ్రెస్, బీజేపీ, ఇండిపెండెంట్ కౌన్సిలర్లు అవిశ్వాసం పెట్టడంతో వారిద్దరూ ముందుగానే రాజీనామా ప్రకటించడం చర్చనీయాంశమైంది. శనివారం మున్సిపల్ కమిషనర్ నాగిరెడ్డిని కలిసి రాజీనామా పత్రాలు సమర్పించారు. అయితే రాజీనామాలు ఇంకా కలెక్టర్ ఆమోదం పొందలేదు. బీఆర్‌ఎస్, కాంగ్రెస్, బీజేపీ, ఇండిపెండెంట్‌కు చెందిన 31 మంది కౌన్సిలర్లు చైర్మన్, వైస్ చైర్మన్‌పై అవిశ్వాసం కోరుతూ డిసెంబర్ 28న స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ వీరారెడ్డికి సంతకాలతో కూడి తీర్మానం కాపీని అందజేశారు. కలెక్టర్ ఆదేశాల మేరకు ఈనెల 23న మున్సిపల్ ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేయాలని అధికారులు నిర్ణయించారు.

క్యాంపులోనే బీఆర్‌ఎస్ కౌన్సిలర్లు

బీఆర్‌ఎస్ కౌన్సిలర్ల క్యాంపు మూడో రోజు కొనసాగుతోంది. ప్రస్తుతం మున్సిపల్ కౌన్సిల్‌లో బీఆర్‌ఎస్ బలం 20 ఉంది. క్యాంపులో ఉన్న 16 మంది ఉన్నారు. తమ చేతిలో నుంచి అధికారం ప్రతిపక్ష పార్టీకి వెళ్లకుండా బీఆర్‌ఎస్ నాయకత్వం పావులు కదుపుతోంది. ఇదిలా ఉండగా అవిశ్వాసం తేదీకి ముందే చైర్మన్, వైస్ చైర్మన్ తమ పదవులకు రాజీనామా చేయడం చర్చనీయాంశంగా మారింది.

23న యథావిధిగా సమావేశం

ఈనెల 23న యథావిధిగా మున్సిపల్ ప్రత్యేక సమావేశం జరగనుంది. చైర్మన్, వైస్‌చైర్మన్‌ల రాజీనామాలను కలెక్టర్ ఇంకా ఆమోదించలేదు.దీంతో ముందుగా నిర్ణయించిన ప్రకారం సమావేశం జరుగుతుంది.

–నాగిరెడ్డి, మున్సిపల్ కమిషనర్, భువనగిరి

పార్టీ నిర్ణయం మేరకు రాజీనామా

పార్టీ నిర్ణయాన్ని గౌరవించి చైర్మన్ పదవికి రాజీనామా చేశాను. మాజీ ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డి నాకు అప్పగించిన బాధ్యతను సక్రమంగా నిర్వర్తించాను. అందరి సహకారంతో పట్టణ అభివృద్ధికి పాటుపడ్డాను. కౌన్సిలర్లు, మున్సిపల్ అధికారులు, సిబ్బంది, ప్రజలందరూ నాకు సహకరించారు. అందరికీ కృతజ్ఞతలు బీఆర్‌ఎస్ పార్టీ కౌన్సిలర్లనే చైర్మన్, వైస్ చైర్మన్‌లను చేస్తాం.

–ఏనబోయిన ఆంజనేయులు, చైర్మన్

అభివృద్ధికి పాటుపడ్డాం

మాజీ ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డి ఆశీర్వాదంతో వైస్ చైర్మన్ అయ్యాను. ఆయనకు కృతజ్ఞతలు. ఆయన ఆదేశాల మేరకు నేను వైస్ చైర్మన్ పదవికి రాజీనామా చేశాను. అందరి సహకారంతో మున్సిపాలిటీ అభివృద్ధికి పాటుపడ్డాం. బీఆర్‌ఎస్ కౌన్సిలర్లు చైర్మన్, వైస్ చైర్మన్ అయ్యేందుకు సంపూర్ణంగా సహకరిస్తా.

–చింతల కిష్టయ్య, వైస్ చైర్మన్

భువనగిరి ఎంపీపీపై..



అవిశ్వాసం కోరుతూ వినతిపత్రం అందజేస్తున్న ఎంపీటీసీలు

భువనగిరి రూరల్ : భువనగిరి ఎంపీపీ నరాల నిర్మలపై అవిశ్వాసం కోరుతూ పది మంది ఎంపీటీసీలు శనివారం ఆర్డీఓ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ఎంపీపీ ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారని, సభ్యుల తీర్మానాలకు వ్యతిరేకంగా పని చేస్తున్నారని, తాము మద్దతు ఉపసంహరించుకుంటున్నామని వినతిపత్రంలో పేర్కొన్నారు. అవిశ్వాస తీర్మానం పెట్టి పదవి నుంచి తొలగించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ ఏనుగు సంజీవరెడ్డి, ఎంపీటీసీలు ఉడుత శారదఅంజనేయులు, కంచి లలితమల్లయ్య, గునుగుంట్ల కల్పన శ్రీనివాస్‌గౌడ్, బొక్క కొండల్‌రెడ్డి, రాసాల మల్లేశ్, సామల వెంకటేశ్, గడ్డమీది చంద్రకళ, బీఆర్‌ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు జనగాం పాండు పాల్గొన్నారు.

మోత్కూరు మున్సిపాలిటీలోనూ..

మోత్కూరు : మోత్కూరు మున్సిపల్ చైర్‌పర్సన్ తీపిరెడ్డి సావిత్రిమేఘారెడ్డి (బీఆర్‌ఎస్)పై అవిశ్వాసానికి కౌన్సిలర్లు సిద్ధమవుతున్నారు. తొమ్మిది మంది కౌన్సిలర్లు సంతకాలు చేసిన తీర్మాన పత్రాన్ని శనివారం కలెక్టర్ హనుమంతు కె.జెండగేకు అందజేశారు. మున్సిపాల్టీలో 12 మంది కౌన్సిలర్లు ఉన్నారు. వీరిలో బీఆర్‌ఎస్ 9, కాంగ్రెస్‌కు ముగ్గురు ఉన్నారు. ఎన్నికల్లో బీఆర్‌ఎస్ నుంచి ఏడుగురు, కాంగ్రెస్ తరపున ఐదుగురు ఎన్నికయ్యారు. వీరిలో కాంగ్రెస్ కౌన్సిలర్లు ఇద్దరు గులాబీ కండువా కప్పుకోవడం ఆ పార్టీ బలం తొమ్మిదికి పెరిగింది. కాగా బీఆర్‌ఎస్‌లో చేరిన కాంగ్రెస్ కౌన్సిలర్ మలిపెద్ది రజిత అసెంబ్లీ ఎన్నికలకు ముందు కాంగ్రెస్‌లో చేరారు. బీఆర్‌ఎస్‌లో చేరిన మరో కాంగ్రెస్ కౌన్సిలర్ కూడా సరైన ప్రాధాన్యం లేకపోవడంతో అంటీముట్టనట్లుగా ఉంటున్నారు. బీఆర్‌ఎస్‌లో ఉంటూనే కాంగ్రెస్ పార్టీతో సంబంధాలు కొనసాగిస్తున్నారు. ప్రస్తుతం బీఆర్‌ఎస్ 8, కాంగ్రెస్ సభ్యులు నలుగురు ఉన్నారు. అవిశ్వాసం తీర్మాన పత్రంపై బీఆర్‌ఎస్ 5, కాంగ్రెస్ కౌన్సిలర్లు నలుగురు సంతకాలు చేశారు. కౌన్సిలర్ల మధ్య కుదిరిన అవగాహన ఒప్పందంలో భాగంగా వైస్ చైర్మన్‌పై అవిశ్వాసం పెట్టవద్దని నిర్ణయించినట్లు తెలిసింది. కాగా చైర్‌పర్సన్ తీపిరెడ్డి సావిత్రిమేఘారెడ్డి, బి.కళ్యాణ్‌చక్రవర్తి, కూరెళ్ల కుమారస్వామి అవిశ్వాసానికి దూరంగా ఉన్నారు.



కలెక్టర్‌కు సంతకాలతో కూడిన తీర్మానం కాపీ అందజేస్తున్న కౌన్సిలర్లు

నవోదయ పరీక్షకు 73.11 శాతం హాజరు



భువనగిరిలోని పరీక్ష కేంద్రం వద్ద విద్యార్థులు

భువనగిరి, పెద్దవూర : చలకుర్తిలోని జవహర్ నవోదయ విద్యాలయంలో 2024–25 విద్యా సంవత్సరానికి ఆరో తరగతిలో ప్రవేశాలకు గాను శనివారం నిర్వహించిన ప్రవేశపరీక్షకు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 73.11 శాతం మంది హాజరైనట్లు ప్రిన్సిపల్ ఆర్.నాగభూషణం తెలిపారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా మొత్తం 25 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేయగా అందులో యాదాద్రి భువనగిరి జిల్లాలో 5, సూర్యాపేటలో 8, నల్లగొండ జిల్లాలో 12 కేంద్రాల్లో పరీక్ష ప్రశాంతంగా జరిగినట్లు పేర్కొన్నారు. నల్లగొండ జిల్లాలో 2,254 మందికి గాను 1,657 మంది (73.51శాతం), సూర్యాపేట జిల్లాలో 1,564 మందికి గాను 1,186 మంది (75.83శాతం), యాదాద్రి భువనగిరి జిల్లాలో 805 మందికి గాను 537 మంది (66.71శాతం) విద్యార్థులు పరీక్షకు హాజరైనట్లు వెల్లడించారు. మొత్తం 80 సీట్లకు నిర్వహించిన ప్రవేశపరీక్షకు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 4,623 మంది విద్యార్థులకు గాను 3,380 మంది పరీక్షకు హాజరు కాగా 1,247 మంది గైర్హాజరైనట్లు పేర్కొన్నారు. ఒక్క సీటుకు 42 మంది విద్యార్థులు పోటీ పడ్డారని తెలిపారు.

కేసులకు సత్వర పరిష్కారం చూపండి



కేసుల వివరాలను పరిశీలిస్తున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి జయరాజు

భువనగిరి రూరల్ : క్రిమినల్ కేసుల పరిష్కారంలో జాప్యం లేకుండా తగిన చర్యలు తీసుకోవాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి జయరాజు కోరారు. జిల్లా కోర్టు ఆవరణలో శనివారం నిర్వహించిన జిల్లా సమన్వయ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. అర్హులకు న్యాయ సహాయం, ఖైదీల క్రిమినల్ కేసులపై పునఃసమీక్ష నిర్వహించాలని సూచించారు. మార్చి 9న నిర్వహించనున్న జాతీయ లోక్ అదాలత్‌లో రాజీపడదగిన కేసుల పరిష్కారానికి కార్యాచరణ చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో మొదటి అదనపు జిల్లా న్యాయమూర్తి కె.మారుతిదేవి, అదనపు సీనియర్ సివిల్ జడ్జి కె.దశరథరామయ్య, ప్రధాన జూనియర్ సివిల్ జడ్జి నాగేశ్వర్‌రావు, అదనపు సీనియర్ సివిల్ జడ్జి జి.కవిత, రాచకొండ కమిషనరేట్ క్రైం డీసీపీ అరవింద్ బాబు, భువనగిరి ఏసీపీ వెంకట్‌రెడ్డి, సబ్‌జైల్ పర్యవేక్షణ అధికారి వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.

ఓటరుగా నమోదు చేసుకోవాలి

- కలెక్టర్ హనుమంతు కె.జెండగే



భువనగిరిలోని ఓటరు నమోదు కేంద్రంలో దరఖాస్తులను పరిశీలిస్తున్న కలెక్టర్

భువనగిరి, బీబీనగర్ : అర్హత కలిగిన ప్రతి ఒక్కరూ ఓటరు నమోదుకు దరఖాస్తు చేసుకోవాని కలెక్టర్ హనుమంతు కె.జెండగే కోరారు. శనివారం ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమంలో భాగంగా భువనగిరిలోని బాహర్‌పేట, బీబీనగర్‌లోని పోలింగ్ కేంద్రాల్లో ఏర్పాటు చేసిన క్యాంపులను ఆయన పరిశీలించారు. ఈ నెల 21వ తేదీన కూడా జిల్లా వ్యాప్తంగా ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమం కొనసాగుతుందన్నారు. పోలింగ్ కేంద్రాల వద్ద ఉదయం 9నుంచి సాయంత్రం 5 గంటల వరకు బూత్ లెవల్ అధికారులు అందుబాటులో ఉంటారని తెలిపారు. బీఎల్‌ఓలు క్షేత్రస్థాయికి వెళ్లి 18 సంవత్సరాల వయస్సు నిండిన వారిని గుర్తించి ఓటరుగా నమోదు చేసుకోవడానికి అవగాహన కల్పించాలని సూచించారు. మరణించిన వారి పేర్లను ఫారం–8 ద్వారా పరిశీలించి ఓటరు జాబితా నుంచి తొలగించాలన్నారు. ఈ నెల 25వ తేదీన జాతీయ ఓటరు దినోత్సవాన్ని పురస్కరించుకొని ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించి ఓటరుగా నమోదు చేసుకునేలా ప్రజలను ప్రోత్సహించాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో భువనగిరి, బీబీనగర్ తహసీల్దార్లు అంజిరెడ్డి, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

ఉచిత శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

నల్లగొండ రూరల్ : ఉమ్మడి జిల్లా నిరుద్యోగ అభ్యర్థులు గ్రూప్–1,2,3,4 పరీక్షల కోసం ఉచిత శిక్షణకు దరఖాస్తు చేసుకోవాలని బీసీ స్టడీ సర్కిల్ డైరెక్టర్ విజయ్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తు గడువు ఈ నెల 24 వరకు పొడిగించామన్నారు. అభ్యర్థులు bcstudycircle. cgg. gov.inలో వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఇతర వివరాలకు 08682 220007 నంబర్‌కు ఫోన్ చేయాలని పేర్కొన్నారు.

ఈ–పాస్ ద్వారానే ఎరువులు విక్రయించాలి

రామన్నపేట : రైతులకు ఈ–పాస్ ద్వారానే ఎరువులు విక్రయించాలని జిల్లా వ్యవసాయశాఖ అధికారి కె.అనురాధ డీలర్లకు సూచించారు. శనివారం రామన్నపేటలో సింగిల్‌విండో గోదాం, ఎన్నారం గ్రామంలో ఎరువులు దుకాణాలను తనిఖీ చేశారు. రికార్డులు, ఎరువుల నిల్వలను పరిశీలించారు. రైతులకు అవసరమైన ఎరువులు, పురుగు మందులను అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. ఎమ్మార్పీకంటే ఎక్కువ ధరకు విక్రయించినా, నిబంధనలు పాటించకపోయినా చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. ఆమె వెంట మండల వ్యవసాయాధికారిణి ఎస్.పద్మజ ఉన్నారు.

బడి బయట పిల్లలు 330 మంది

- సర్వేలో గుర్తించిన విద్యాశాఖ అధికారులు
- 31వ తేదీ వరకు సర్వే పొడిగింపు



రాజాపేట మండలంలో సర్వే చేస్తున్న సీఆర్‌పీ (ఫైల్)

భువనగిరి : బడిబయటి పిల్లలను గుర్తించి బడిలో చేర్పించేందుకు విద్యాశాఖ ఆధ్వర్యంలో చేపట్టిన సర్వే ఈనెల 10న ముగిసింది. బడిబయట 330 మంది పిల్లలు ఉన్నట్లు అధికారులు గుర్తించారు. ఇందులో జిల్లాకు చెందినవారు 80, ఇతర రాష్ట్రాల నుంచి వలసవచ్చిన వారి పిల్లలు 250 మంది ఉన్నారు. అయితే బడిబయట ఒక్కరు కూడా ఉండవద్దనే లక్ష్యంతో సర్వేను ఈనెల 31వ తేదీ వరకు పొడిగిస్తూ విద్యాశాఖ నిర్ణయం తీసుకుంది.

పిల్లల భవిష్యత్తును తీర్చిదిద్దేలా..

సమగ్రశిక్షా అభియాన్, విద్యాశాఖ ఆధ్వర్యంలో 50 కాంప్లెక్స్‌ల పరిధిలో విధులు నిర్వహిస్తున్న 58 మంది సీఆర్‌పీలు సర్వే చేపట్టారు. ఇంటింటికి తిరగడంతో పాటు ఇటుక బట్టీలు, కర్మాగారాల్లో తనిఖీలు నిర్వహించారు. 6నుంచి 14 సంవత్సరాల మధ్య వయస్సు గల పిల్లలు 66 మందిని గుర్తించి ఆన్‌లైన్‌లో వివరాలు నమోదు చేసి వారిని పాఠశాలల్లో చేర్పించారు. 15 నుంచి 19 ఏళ్ల వయస్సున్న పిల్లలను 14 మందిని గుర్తించారు. వీరిని ఓపెన్ స్కూల్‌లో టెన్త్ లేదా ఇంటర్ ప్రవేశాలు పొందేలా చర్యలు తీసుకుంటున్నారు. ఇతర రాష్ట్రాల నుంచి వలస వచ్చిన వారి పిల్లలు 250 మంది ఉండగా వారి కోసం మొబైల్ స్కూళ్లు ఏర్పాటు చేయనున్నారు.

బడీడు పిల్లలు బడిబయట ఉండవద్దన్నదే లక్ష్యం

బడీడు పిల్లలు బడిబయట ఉండకూడదనే లక్ష్యంతో నెల రోజుల పాటు సర్వే చేపట్టాం. గుర్తించిన పిల్లల వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేసి పాఠశాలల్లో చేర్పించాం. ఇతర రాష్ట్రాల పిల్లల కోసం అవసరమైన ప్రాంతాల్లో మొబైల్ స్కూళ్ల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నాం. సర్వేను విద్యాశాఖ మళ్లీ ఈ నెల 31వ తేదీ వరకు పొడిగించింది.

–నారాయణరెడ్డి, డీఈఓ

19నుంచి మళ్లీ మొదలైన సర్వే

బడి బయటి పిల్లలను గుర్తించేందుకు డిసెంబర్ 11నుంచి ఈ నెల 10వ తేదీ వరకు సర్వే కొనసాగింది. అయితే బడిబయట ఒక్కరు కూడా ఉండవద్దనే లక్ష్యంతో సర్వేను విద్యాశాఖ తిరిగి ఈ నెల 31వ తేదీ వరకు పొడిగించింది. 19వ తేదీ నుంచి సర్వే ప్రారంభం కానుంది.

క్లుప్తంగా

వివాహిత ఆత్మహత్య

చౌటుప్పల్ : అనారోగ్య కారణాలతో ఓ వివాహిత ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. ఈ ఘటన చౌటుప్పల్ మండల పరిధిలోని దేవలమ్మనాగారం గ్రామంలో చోటుచేసుకుంది. దేవలమ్మనాగారానికి చెందిన పిల్లలమర్రి స్రవంతి(33) గృహిణి. ఆమె భర్త నరహరి ప్రైవేటు ఉద్యోగం చేస్తున్నాడు. ఇటీవల తలెత్తిన అనారోగ్య కారణాల మూలంగా స్రవంతి శుక్రవారం అర్ధరాత్రి దాటాక తన ఇంట్లోనే ఫ్యాన్‌కు చీరతో ఉరేసుకుంది. కుటుంబ సభ్యులు గమనించేలోపే ఆమె మృతిచెందింది. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ఆస్పత్రికి తరలించారు. మృతురాలి భర్త ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని సీఐ దేవేందర్ తెలిపారు.

గడ్డి మందు తాగిన యువకుడు మృతి


మహేష్ (ఫైల్)

రామగిరి(నల్లగొండ): గడ్డి మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న యువకుడు మృతిచెందాడు. తిప్పర్తి మండలం చిన్నాయిగూడేనికి చెందిన బైరబోని మహేష్ (26) డిగ్రీ పూర్తి చేశాడు. నల్లగొండలో ప్రైవేట్ ఉద్యోగం చేసుకుంటూ అక్కడే గది అద్దెకు తీసుకుని మిత్రులతో కలిసి ఉంటున్నాడు. ఈ నెల 17న నల్లగొండలో ఉంటున్న గదిలో ఎవరూ లేని సమయంలో మహేష్ గడ్డి మందు తాగాడు. అనంతరం విషయాన్ని మిత్రుడికి ఫోన్ చేసి చెప్పగా వారు కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. వారు వెంటనే మహేష్‌ను నల్లగొండలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పించగా చికిత్స పొందుతూ శుక్రవారం రాత్రి 11గంటలకు మృతిచెందాడు. మహేష్ అవివాహితుడు. ఇతడి ఆత్మహత్యకు ప్రేమ వ్యవహారమే కారణం కావచ్చని గ్రామస్తులు అనుమానిస్తున్నారు.

మద్యం పట్టివేత

కొండమల్లేపల్లి : కొండమల్లేపల్లి మండల కేంద్రం నల్లగొండ రోడ్డులోని బైపాస్ వద్ద అనుమతులు లేకుండా మద్యం విక్రయిస్తున్న బెల్టు దుకాణంపై శనివారం పోలీసులు దాడి చేశారు. ఓ వ్యక్తి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు ఆ దుకాణంలో తనిఖీలు నిర్వహించి రూ.22,900 విలువ చేసే మద్యాన్ని పట్టుకున్నారు.దుకాణ నిర్వాహకుడు కొండ్రరెడ్డి రమేశ్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ వీరబాబు తెలిపారు.

వైద్య రంగానికి కేంద్రం పెద్దపీట


ఎయిమ్స్‌ను పరిశీలిస్తున్న కేంద్ర విద్యుత్ పునరుత్పాదక, ఇంధన శాఖ మంత్రి రాజ్‌కుమార్ సింగ్


ముద్ర యోజన పథకం కింద లబ్ధిదారులకు చెక్కు అందజేస్తున్న కేంద్ర మంత్రి

- భారత్‌ను మహాశక్తిగా తీర్చిదిద్దడమే మోదీ లక్ష్యం
- కేంద్ర విద్యుత్ పునరుత్పాదక, ఇంధన శాఖ మంత్రి రాజ్‌కుమార్ సింగ్

బీబీనగర్: కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం వైద్య రంగానికి పెద్ద పీట వేస్తోందని కేంద్ర విద్యుత్ పునరుత్పాదక, ఇంధన శాఖ మంత్రి రాజ్‌కుమార్ సింగ్ పేర్కొన్నారు. అందులో భాగంగానే జిల్లా స్థాయి ఆస్పత్రులతో పాటు రూరల్ హెల్త్ సెంటర్లను అభివృద్ధి చేస్తున్నట్లు తెలిపారు.బీబీనగర్‌లోని ఎయిమ్స్ వైద్య కళాశాల ఆవరణలో శనివారం నిర్వహించిన వికసిత్ భారత్ సంకల్ప్ యాత్ర అవగాహన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు.భారత్‌ను మహాశక్తిగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా మోదీ సర్కార్ పనిచేస్తోందని చెప్పారు.పేదలు ఆర్థికాభివృద్ధి సాధించేందుకు కేంద్రం అనేక పథకాలను ప్రవేశపెట్టి అమలు చేస్తోందని పేర్కొన్నారు. 3వేల కోట్ల మందికి ఇళ్లు నిర్మించి ఇచ్చామని తెలిపారు. జీడీపీలో దేశం మూడో స్థానంలో ఉందని, ఆయుష్మాన్ భారత్ ద్వారా 5లక్షల ఆరోగ్య బీమా కల్పించినట్లు చెప్పారు. ముద్ర పథకం ద్వారా ఎంతో మంది ఉపాధి పొందుతున్నారని తెలిపారు. అనంతరం వికసిత్ భారత్ సంకల్ప యాత్రలో భాగంగా వివిధ బ్యాంకుల నుంచి ముద్ర స్కీం ద్వారా రుణాలు పొందిన లబ్ధిదారుల అనుభవాలను ఆయన పంచుకున్నారు. వివిధ బ్యాంకుల ద్వారా పలువురు లబ్ధిదారులకు మంజూరైన చెక్కులు అందజేశారు. అలాగే కేంద్ర సమాచార మంత్రిత్వ శాఖ రూపొందించిన నూతన క్యాలెండర్, బ్రోచర్లతో పాటు బ్యాంక్ ఆఫ్ బరోడా నూతన క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఖాతాదారులకు బ్యాంకులు కల్పిస్తున్న స్కీంల గురించి వివరించేలా ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను సందర్శించారు.

కేంద్ర మంత్రికి ఘన స్వాగతం

అంతకుముందు కేంద్ర మంత్రికి ఎయిమ్స్ డైరెక్టర్ ఆర్‌కే సింగ్‌కు ఎయిమ్స్ డైరెక్టర్ వికాస్ భాటియాతో పాటు మాజీ ఎంపీ బూర నర్సయ్యగౌడ్, బీజేపీ రాష్ట్ర నాయకులు గూడూరు నారాయణరెడ్డి, జిల్లా అధ్యక్షుడు భాస్కర్, వైద్యులు ఘన స్వాగతం పలికారు. ఎయిమ్స్ పురగోతి, వైద్య సేవలపై డైరక్టర్‌తో మంత్రి చర్చించారు.ఎయిమ్స్‌లో అందుతున్న వైద్య సేవలు, జరుగుతున్న నిర్మాణాల గురించి డెరెక్టర్ కేంద్ర మంత్రికి వివరించారు. ఆయా కార్యక్రమాల్లో కార్యక్రమంలో యాదాద్రి జిల్లా అదనపు కలెక్టర్ వీరారెడ్డి, ఎంపీపీ సుధాకర్‌గౌడ్, తహసీల్దార్ శ్రీధర్, ఎంపీడీఓ శ్రీవాణి, ఏంపీఓ స్వాతి, ఎస్‌బీఐ, బ్యాంక్ ఆఫ్ బరోడా, కెనరా బ్యాంకుల జనరల్ మేనేజర్లు రితేష్, రకుల్‌కుమార్, శాంతికుమార్ పాల్గొన్నారు.

కేవీకే శాస్త్రవేత్త కిరణ్‌కు అవార్డు



అవార్డు అందజేస్తున్న ఏరువాక ఫౌండేషన్ ఫౌండర్ రాఘవరావు



శేషకుమార్‌కు పురస్కారం అందజేస్తున్న నిర్వాహకులు

గరిడేపల్లి : రైతులకు విశేష సేవలు అందించినందుకు గాను గడ్డిపల్లి కేవీకే శాస్త్రవేత్త కిరణ్‌కు ఏరువాక వ్యవసాయ వార్షిక అవార్డు దక్కింది. శనివారం హైదరాబాద్‌లో నిర్వహించిన కార్యక్రమంలో పద్మశ్రీ చింతల వెంకట్‌రెడ్డి, ఏరువాక ఫౌండేషన్ ఫౌండర్ గారా రాఘవరావు చేతుల మీదుగా శాస్త్రవేత్త కిరణ్‌కు అవార్డు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతుల అభ్యున్నతికి కృషి చేసిన వారికి ఇచ్చే గొప్ప గౌరవమన్నారు.

సిరిపురం రైతుకు రాష్ట్రస్థాయి పురస్కారం

నడిగూడెం: మండలంలోని సిరిపురం గ్రామానికి చెందిన అభ్యుదయ రైతు వాసికర్ల శేషకుమార్‌కు శనివారం హైదరాబాద్‌లోని మల్లారెడ్డి విశ్వవిద్యాలయంలో ఏరువాక ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో రాష్ట్ర స్థాయి ఉత్తమ సేంద్రియ రైతు పురస్కారాన్ని అందజేశారు. పద్మశ్రీ డాక్టర్ చింతల వెంకట్‌రెడ్డి, మల్లారెడ్డి ఐసీఏఆర్ మాజీ డైరెక్టర్ డాక్టర్.బి.వెంకటేశ్వర్లు, వీసీ డాక్టర్.వీఎస్‌కె.రెడ్డి, రిజిస్ట్రార్ ఎం.ఆంజనేయులు, నిర్వాహకులు పాల్గొన్నారు.

మట్టపల్లి క్షేత్రంలో నిత్యారాధనలు

మఠంపల్లి: మట్టపల్లి శ్రీలక్ష్మీనృసింహస్వామి ఆలయంలో శనివారం స్వామివారికి నిత్యారాధనలు శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఆలయంలో వేకువజామున సుప్రభాతసేవ, నిత్యఅగ్నిహోత్రి, మూల విరాట్‌స్వామికి పంచామృతాభిషేకం చేశారు. ప్రధానాలయంలోని ముఖమండపంలో నూతన పట్టు వస్త్రాలతో స్వామిఅమ్మవార్లను వధూవరులుగా అలంకరించి ఎదుర్కోళ్ల మహోత్సవ సంవాదం చేపట్టారు. అనంతరం నిత్య కల్యాణాన్ని ఘనంగా నిర్వహించి స్వామి అమ్మవార్లను గరుడ వాహనంపై ఆలయ వీధుల్లో ఊరేగించారు. కార్యక్రమంలో ఆలయ అనువంశిక ధర్మకర్తలు చెన్నూరు మట్టపల్లిరావు, విజయ్‌కుమార్, ఈఓ నవీన్‌కుమార్ పాల్గొన్నారు.

తలనీలాల హక్కుకు 24న బహిరంగ వేలం

మట్టపల్లి క్షేత్రంలో తలనీలాలు పోగు చేసుకునే హక్కుకు ఈనెల 24న దేవాలయ ఆవరణలో బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ చెన్నూరు మట్టపల్లిరావు, ఈఓ నవీన్‌కుమార్ తెలిపారు. వేలంలో పాల్గొనే వారు రూ.4లక్షలు డిపాజిట్ చేయాల్సి ఉంటుందని పేర్కొన్నారు.

థర్మకోల్‌తో అయోధ్య రామ మందిరం

- అబ్బుర పరిచిన విద్యార్థి హృతిక్ గౌడ్ నైపుణ్యం


థర్మకోల్‌తో తయారు చేసిన రామ మందిరంతో హృతిక్ గౌడ్

మోత్కూరు : మోత్కూరు మున్సిపల్ కేంద్రానికి చెందిన గనగాని అనిల్, పావని దంపతుల చిన్న కుమారుడు గనగాని హృతిక్ గౌడ్ థర్మకోల్‌తో అయోధ్య రామ మందిరాన్ని తయారు చేసి అబ్బుర పరిచాడు. 5వ తరగతి వరకు స్థానిక అక్షర ఇంగ్లిష్ మీడియం పాఠశాలలో చదివిన హృతిక్ ప్రస్తుతం కీసర ఎస్‌ఆర్ ప్రాథమిక పాఠశాలలో 6వ తరగతి చదువుతున్నాడు. సంక్రాంతి సెలవులకు ఇంటికి వచ్చిన విద్యార్థి థర్మకోల్‌తో రామ మందిరం నిర్మాణం చేసి ప్రతిభ చాటుకున్నాడు. పలువురు విద్యార్థి నైపుణ్యాన్ని అభినందిస్తున్నారు.

బంగారంతో శ్రీరాముడికి సూక్ష్మపాదాలు


స్వామి వారి పాదాలు


శ్రీనివాసచారి

నార్కట్‌పల్లి : అయోధ్యలో ఈ నెల 22న రామ మందిరం ప్రారంభం సందర్భంగా నార్కట్‌పల్లికి చెందిన స్వర్ణకారుడు శ్రీనివాసచారి 00.130 మిల్లీ గ్రాముల బంగారంతో శ్రీరాముడికి సూక్ష్మపాదాలు తయారు చేశాడు. ఒక్కో పాదం 8 ఎం ఎం పొడవు, 4 ఎం ఎం వెడల్పుతో గంట వ్యవధిలోనే తయారు చేసినట్లు శ్రీనివాసచారి పేర్కొన్నాడు. శ్రీరాముడిపై ఉన్న భక్తితో సూక్ష్మ పాదాలు తయారు చేసినట్లు తెలిపాడు. గతంలో బియ్యపు గింజపై జాతీయ జెండాను ఆవిష్కరించినట్లు పేర్కొన్నాడు.

ఉట్లపల్లిలో బత్తాయి మొక్కల నరికివేత

- అనుమానితులపై పోలీసులకు బాధిత రైతు ఫిర్యాదు


నరికివేసిన బత్తాయి మొక్కలను చూపుతున్న బాధిత రైతు మల్లయ్య

పెద్దవూర: పెద్దవూర మండలంలోని ఉట్లపల్లి గ్రామంలో ఓ రైతు పెంచుతున్న బత్తాయి మొక్కలను గుర్తుతెలియని వ్యక్తులు నరికివేశారు. గ్రామస్తులు, బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం.. ఉట్లపల్లికి చెందిన బోదాసు మల్లయ్యకు గ్రామ శివారులో సర్వే నంబర్ 291లో గల వ్యవసాయ భూమిలో 230 బత్తాయి మొక్కలు నాటాడు. ఈ భూమిని ఆనుకుని గ్రామానికి చెందిన భూతరాజు సాయన్న వ్యవసాయ భూమి ఉంది. 19 ఏళ్ల క్రితం బోదాసు మల్లయ్య భూమిలో ఉండాల్సిన దానికంటే 30 గుంటలు(ముప్పావు ఎకరం) ఎక్కువగా ఉందని 2005 సంవత్సరంలో సర్వేయర్‌తో కొలతలు వేశారు. దీంతో 31 గుంటల భూమి ఎక్కువ తేలడంతో అప్పట్లోనే గ్రామ పెద్దమనుషులు సాయన్నకు రూ.14వేలు ఇప్పించారు. అప్పటితో ఈ సమస్యకు తెర పడింది. ధరణి రాకతో బోదాసు మల్లయ్యకు చెందిన 31గుంటల భూమి మళ్లీ సాయన్న భూరికార్డులోకి ఎక్కింది. దీంతో బత్తాయి మొక్కలు నాటినప్పటినుంచి వీరిద్దరి మధ్య గొడవలు జరుగుతున్నాయి. ఈ క్రమంలోనే శుక్రవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు బోదాసు మల్లయ్యకు చెందిన 170 బత్తాయి మొక్కలను గొడ్డళ్లతో నరికి వేశారు. శనివారం ఉదయం మల్లయ్య తన బత్తాయి తోట వద్దకు వెళ్లగా మొక్కలు నరికివేసి ఉన్నాయి. దీంతో బాధితుడు అనుమానితులపై పెద్దవూర పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ అజ్మీరా రమేష్ తెలిపారు.

లారీ ఢీకొని మతిస్థిమితం లేని వ్యక్తి మృతి


మృతదేహాన్ని పరిశీలిస్తున్న గ్రామస్తులు

పాలకవీడు: లారీ ఢీకొని మతిస్థిమితం లేని వ్యక్తి మృతిచెందాడు. పాలకవీడు మండల పరిధిలో జరిగిన ఈ ఘటన వివరాలు ఇలా ఉన్నాయి. పాలకవీడు మండలం గుడుగుంట్లపాలెం గ్రామానికి చెందిన పాపుగంటి దేవదానం(56) కొంత కాలం క్రితం మతిస్థిమితం కోల్పోయి రోడ్ల వెంట తిరుగుతున్నాడు. ఈ క్రమంలో శనివారం గ్రామ శివారులోని శివాలయం సమీపంలోని రోడ్డుపై ఉన్న ఇతడిని జాన్‌పహాడ్ వైపు నుంచి నేరేడుచర్ల వైపు వస్తున్న లారీ ఢీకొట్టింది. దీంతో దేవదానం తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతిచెందాడు. గ్రామస్తులు లారీని నిలిపివేసి పోలీసులకు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు లారీని స్టేషన్‌కు తరలించారు. ప్రమాదానికి కారణమైన డ్రైవర్‌ను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

యువకుడికి తీవ్ర గాయాలు


ఘటనాస్థలిలో సహాయక చర్యలు చేపడుతున్న స్థానికులు

రామన్నపేట : కంటైనర్ ఢీకొట్టడంతో యువకుడికి తీవ్రగాయాలు అయ్యాయి. ఈ ఘటన శనివారం రామన్నపేట మండలకేంద్రంలో జరిగింది. నల్లగొండ జిల్లా నిడమనూరు మండలం రాజన్నగూడేనికి చెందిన పరమేష్ బైక్‌పై రామన్నపేట నుంచి నల్లగొండ వైపు వెళ్తుండగా సబ్‌స్టేషన్ సమీపంలో ఎదురుగా వస్తున్న కంటైనర్ బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో పరమేష్‌కు తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రుడిని 108 వాహనంలో స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకువెళ్లి ప్రథమ చికిత్స చేయించారు. మెరుగైన వైద్యం కోసం నల్లగొండ ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లారు. ఈ ఘటనపై పోలీసులకు ఫిర్యాదు అందలేదు.

తేనెటీగల పెంపకంపై రేపటి నుంచి ఉచిత శిక్షణ

గరిడేపల్లి : శాస్త్రీయ పద్ధతిలో తేనెటీగల పెంపకంపై కేవీకే గడ్డిపల్లిలో ఈ నెల 22, 23వ తేదీల్లో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు కేవీకే ఇంచార్జి పోగ్రాం కోఆర్డినేటర్ నరేష్ తెలిపారు. శనివారం ఆయన స్థానికంగా విలేకరులతో మాట్లాడారు. ఆసక్తి కల్గిన విద్యార్థులు, యువత, రైతులు, ఆధార్‌కార్డుతో తమ పేర్లను నేరుగా కేవీకేలో నమోదు చేసుకోవాలన్నారు. ఈ శిక్షణ కార్యక్రమంలో ఉచితంగా భోజనం, వసతి సదుపాయం అందించనున్నట్లు తెలిపారు. శిక్షణ తీసుకోవాలనుకునే వారు 10వ తరగతి వరకు చదివి ఉండాలని తెలిపారు.

కబడ్డీ పోటీలకు ఎంపిక


కప్‌తో విద్యార్థులు నితిన్, నిఖిల్

డిండి: మండల పరిధిలోని చెర్కుపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన నితిన్, ఎన్.నిఖిల్ జాతీయ స్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికైనట్లు ఆ పాఠశాల హెచ్ఎం రాంరెడ్డి తెలిపారు.విద్యార్థులు నిఖిల్, నితిన్ ఇటీవల జనగామలో జరిగిన రాష్ట్ర స్థాయి అండర్-14 కబడ్డీ పోటీల్లో ప్రతిభ కనబరిచారని తెలిపారు. వీరు ఈ నెల 24వ తేదీ నుంచి 28 వరకు జార్ఖండ్‌లో జరిగే జాతీయ స్థాయి కబడ్డీ పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. ఆ విద్యార్థులను పాఠశాల ఉపాధ్యాయులు, స్పోర్ట్స్ క్లబ్ సభ్యులు శనివారం అభినందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు లెనిన్‌బాబు, తిర్పతయ్య, జయరాజు, శోభన్‌బాబు, లాల్‌సింగ్, రహూఫ్, సృజన, రమాదేవి, ప్రభావతి, ధనమ్మ ఉన్నారు.

దాడిచేసిన వ్యక్తిపై కేసు

మర్రిగూడ : మహిళపై దాడి చేసి గాయపరిచిన వ్యక్తిపై శనివారం మర్రిగూడ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. చింతపల్లి మండల పరిధిలోని చాకలిశేరుపల్లి గ్రామానికి చెందిన సిలివేరు నాగమ్మ పదేళ్ల క్రితం భర్త యాదయ్యతో గొడవపడి మర్రిగూడ మండలంలోని కొండూరు గ్రామంలోని పుట్టింటికి వచ్చి ఉంటుంది. ఈ క్రమంలో శుక్రవారం రాత్రి నాగమ్మ గాయాలతో ఇంటి వద్ద పడి ఉండడాన్ని స్థానికులు గమనించారు. వెంటనే నాగమ్మ కూతురు శిరీషకు ఫోన్‌లో సమాచారం ఇచ్చారు. ఆమె వచ్చి తల్లిని మాల్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించి చికిత్స చేయిస్తోంది. గ్రామానికి చెందిన మల్లేష్ తన తల్లిపై దాడి చేసి గాయపరిచాడని శిరీష ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రంగారెడ్డి తెలిపారు.

భూ తగాదాలతో వ్యక్తిపై దాడి

మాడుగులపల్లి : భూతగాదాల నేపథ్యంలో ఓ వ్యక్తిపై ముగ్గురు దాడికి పాల్పడ్డారు. మాడుగులపల్లి మండలంలోని గజలాపురం గ్రామంలో ఈ ఘటన చోటు చేసుకుంది. గజలాపురం గ్రామానికి చెందిన జక్క నాగయ్యకు అదే గ్రామానికి చెందిన ముద్దం మహేష్‌కు మధ్య కొన్నిరోజులుగా ఇంటిస్థలం విషయంలో వివాదం నడుస్తోంది. ఇదే విషయంలో శనివారం ఇద్దరి మధ్య మరోమారు గొడవ జరిగింది. దీంతో విచక్షణ కోల్పోయిన మహేష్ అతడి సమీప బంధువులిద్దరితో కలిసి నాగయ్యపై దాడి చేయడంతో తీవ్రగాయాలయ్యాయి. బాధితుడిని చికిత్స నిమిత్తం కుటుంబ సభ్యులు హైదరాబాద్‌కు తరలించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు నిందితులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ నరేష్‌కుమార్ తెలిపారు.

చనిపోతూ మరో ఇద్దరికి ప్రాణదానం

- బ్రెయిన్‌డెడ్ అయిన వ్యక్తి అవయవాలు దానం


దుర్గయ్య (ఫైల్)

శాలిగౌరారం: ఓ వ్యక్తి తాను చనిపోతూ మరో ఇద్దరికి ప్రాణదానం చేశాడు. బ్రెయిన్ డెడ్ అయిన వ్యక్తి అవయవాలను కుటుంబ సభ్యులు దానం చేసి ఆదర్శంగా నిలిచారు. శాలిగౌరారం మండలం ఇటుకులపహాడ్ గ్రామానికి చెందిన అల్లి దుర్గయ్య(54)కు భార్య, వివాహితులైన ఇద్దరు చొప్పున కుమార్తెలు, కుమారులు ఉన్నారు. దుర్గయ్య వృత్తిరీత్యా మత్స్యకారుడు. మూసీ ప్రాజెక్టులో చేపలు పట్టుకుని విక్రయించి కుటుంబాన్ని పోషిస్తున్నాడు. వివాహితులైన కుమారులు హైదరాబాద్‌లో ప్రైవేట్ ఉద్యోగాలు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. నాలుగు రోజుల క్రితం దుర్గయ్య బాత్‌రూంలో రక్తపోటుకు గురై అపస్మారక స్థితిలోకి వెళ్లాడు. గమనించిన కుటుంబ సభ్యులు దుర్గయ్యను తొలుత నకిరేకల్‌లోని ఆస్పత్రికి అక్కడి నుంచి హైదరాబాద్‌కు తీసుకెళ్లారు. అక్కడ ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న దుర్గయ్య బ్రెయిన్ శుక్రవారం అర్ధరాత్రి డెడ్ అయినట్లు వైద్యులు నిర్ధారించారు. వైద్యుల సూచన మేరకు కుటుంబ సభ్యులు దుర్గయ్య అవయవాలను దానం చేసేందుకు ముందుకు వచ్చారు. జీవన్‌ధాన్ ఫౌండేషన్‌కు సమాచారం అందించడంతో వారు దుర్గయ్యకు సంబంధించిన కాలేయం, కళ్లను సేకరించి అవసరాలు కలిగిన మరో ఇద్దరికి అమర్చి ప్రాణం పోశారు. శనివారం సాయంత్రం గ్రామంలో దుర్గయ్య అంత్యక్రియలు జరిగాయి.

వేధిస్తున్న సిబ్బంది కొరత

- పీహెచ్‌సీలో నామమాత్రంగా 24గంటల వైద్యసేవలు
- విధుల్లో కానరాని డాక్టర్, సిబ్బంది
- ఇబ్బందులు పడుతున్న ప్రజలు

మోటకొండూర్ : మండలంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పూర్తిస్థాయిలో వైద్యులు, సిబ్బంది లేకపోవడంతో రోగులకు వైద్యసేవలు అందడం లేదు. గత ప్రభుత్వం 2022లో 12గంటల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని 24గంటలు వైద్యసేవలు అందించేలా అప్ గ్రేడ్ చేస్తున్నట్లు ప్రకటించారు. కాని నేటికి ఆ విధానం అమలు జరగడం లేదు, అదే విధంగా అందుకు తగ్గట్లుగా సిబ్బంది నియామకం చేపట్టలేదు. దీంతో మండల ప్రజలకు వైద్యం అందక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మండలంలో 24,435మంది జనాభాకు ప్రభుత్వం మండల కేంద్రంలో ఓ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంతో పాటు, నాలుగు సబ్ సెంటర్లు ఏర్పాటు చేసింది. కాని ఆ సెంటర్లలో సిబ్బంది, వైద్యులు లేకపోవడంతో మండల ప్రజలు ప్రైవేట్ ఆస్పత్రులను ఆశ్రయించాల్సి వస్తుందని వాపోతున్నారు. పీహెచ్‌సీ పరిధిలో ఒక డాక్టర్, ముగ్గురు మొదటి ఏఎన్ఎంలు, డాటాఎంట్రీ ఆఫీసర్, ఇద్దరు హెల్త్‌అసిస్టెంట్ మేల్స్, ల్యాబ్ అటెండర్, 108డ్రైవర్, ఇద్దరు కాంటిజెంట్ వర్కర్స్, ఇద్దరు నైట్ వాచ్‌మెన్స్ ఉండాల్సినప్పటికీ వారు లేకపోవడంతో మండలంలో వైద్యం కుంటుపడుతుంది.



మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం

కానరాని డాక్టర్, సిబ్బంది..

ప్రతిరోజు ఆసుపత్రి తెరిచినా ఆస్పత్రిలో మాత్రం స్టాఫ్‌నర్స్ మరో సిబ్బంది మినహా ఎవరు కనిపించని పరిస్థితి. ఉన్న సిబ్బంది సైతం 11గంటలకు వచ్చి మధ్యాహ్నం 1-2 గంటల వరకు మాత్రమే ఉండి వెళ్లిపోతున్నారు. ఆస్పత్రిలో డాక్టర్ కనీసం కానరాని పరిస్థితి నెలకొంది. ఫీల్డ్‌పై వెళ్లాల్సిన సిబ్బంది ఆసుపత్రిలో, ఆసుపత్రిలో ఉండాల్సిన సిబ్బంది ఇంటి వద్ద ఇలా పీహెచ్‌సీని క్రమం తప్పి నడిపిస్తున్నారు. దీంతో ఏదైనా అత్యవసర సమయంలో ఆస్పత్రి వస్తే ఇక ప్రాణాలు పోవాల్సిందేనని మండల ప్రజలు ఆరోపిస్తున్నారు.

నిరుపయోగంగా 30 పడకల ఆసుపత్రి భవనం, అంబులెన్స్ సేవలు..

పీహెచ్‌సీని కోట్లు వెచ్చించి 30పడకలతో అధునాతన పరికరాలతో నిర్మించారు. కాని ఈ భవనం ఉపయోగించకుండా తాళాలు వేసి నిరుపయోగంగా ఉంచుతున్నారు. అలాగే అత్యవసర పరిస్థితిలో ఉన్నత ఆసుపత్రులకు తీసుకెళ్లేందుకు దాతలు ఇచ్చిన అంబులెన్స్‌కు డ్రైవర్ లేక నిరుపయోగంగా పీహెచ్‌సీ ఆవరణలో ఉంచుతున్నారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి ఆస్పత్రికి సరిపడా వైద్యులను, సిబ్బందిని ఏర్పాటు చేసి మెరుగైన వైద్యం అందించేలా చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు కోరుతున్నారు.



నిరుపయోగంగా ఉన్న అంబులెన్స్

ఖాళీ పోస్టులను భర్తీ చేయాలి



స్థానిక పీహెచ్‌సీలో 24గంటల సేవలకు సరిపడే విధంగా ప్రభుత్వం వెంటనే చర్యలు చేపట్టి సిబ్బంది ఖాళీలను భర్తీచేయాలి. అదే విధంగా రోగులకు అందుబాటులో డాక్టర్, సిబ్బంది ఉండటం లేదు. జిల్లా వైద్య అధికారి సమీక్ష నిర్వహించి అందుబాటులో సిబ్బంది ఉండే విధంగా చర్యలు చేపట్టాలి. ఆసుపత్రిలో అన్ని వసతులు ఉన్నప్పటికీ నిరుపయోగంగా ఉంటున్నాయి.

– పీసరి తిరుమలరెడ్డి, బీజేపీ నాయకుడు

నర్సరీలో ప్రతిమొక్కనూ సంరక్షించాలి

బొమ్మలరామారం : నర్సరీలో పెంచుతున్న ప్రతిమొక్కనూ సంరక్షించాలని జిల్లా అదనపు కలెక్టర్ వీరారెడ్డి అధికారులకు సూచించారు. మండలంలోని నాగినేనిపల్లి గ్రామంలో గల నర్సరీని శనివారం పరిశీలించి మండల అధికారులకు పలు సూచనలు చేశారు. గ్రామాల్లోని వైకుంఠధామాలు, డంపింగ్‌యార్డుల పరిసరాలలో చెట్లను బయోఫెన్సింగ్‌లా నాటాలన్నారు. నర్సరీల్లో పెంచుతున్న మునగ, కరివేప, కుంకుడు లాంటి మొక్కలను గ్రామ ప్రజలకు అందజేసి నాటించి సంరక్షణ బాధ్యతలు అప్పగించాలన్నారు. గ్రామాల్లో పరిసరాల పరిశుభ్రతతో పాటు పచ్చదనం పెంచడంలో ప్రజల భాగస్వామ్యం తప్పనిసరి అన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీనివాసరావు, ఎంపీడీఓ సరిత, కార్యదర్శి స్వప్న, సిబ్బంది పాల్గొన్నారు.



నర్సరీలో మొక్కలను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ వీరారెడ్డి

ప్రతిభను వెలికితీసేందుకే టాలెంట్ టెస్ట్



గుండాల : మాట్లాడుతున్న ఎంఈఓ శ్రీధర్

గుండాల : విద్యార్థులలో దాగిఉన్న ప్రతిభను వెలికితీసేందుకు గణిత టాలెంట్ టెస్ట్ ఎంతో దోహదపడుతుందని మండల విద్యాధికారి వి.శ్రీధర్ అన్నారు. శనివారం మండల కేంద్రంలో మండల స్థాయిలో విద్యార్థులకు గణిత టాలెంట్ టెస్టును నిర్వహించారు. ప్రథమ టాలెంట్ టెస్టు విజయ జె.కావ్య (జెడ్పీహెచ్ఎస్, సుద్దాల), ద్వితీయ బహుమతి ఎస్.హేమావతి (జెడ్పీహెచ్ఎస్, వెల్మజాల), తృతీయ బహుమతి డి.శ్రీవాణి, (జెడ్పీహెచ్ఎస్, అనంతారం) గెలుపొందారు. కార్యక్రమంలో హెచ్ఎం ఐతరాజు గిరివర్ధన్, ఉపాధ్యాయులు ఎస్.నర్సయ్య, యాస రాజశేఖర రెడ్డి, జనార్దన్‌రెడ్డి, గౌరి, సీఆర్‌పీ లింగయ్య తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు గణిత టాలెంట్ టెస్ట్

అడ్డగూడూరు : మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో తెలంగాణ గణిత ఫోరం ఆధ్వర్యంలో శనివారం మండల స్థాయి గణిత టాలెంట్ టెస్టును నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ చంద్రమౌళి పాల్గొని పరీక్షను పరిశీలించారు. కార్యక్రమంలో తెలంగాణ గణిత ఫోరం జిల్లా అధ్యక్షుడు భూపతి వెంకన్న, హెచ్ఎం రహిమున్నిసా , గణిత ఉపాధ్యాయులు శ్రీనివాస్, రవికుమార్, రాంగోపాల్, దామోదర్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

కేంద్ర మంత్రికి స్వాగతం పలికిన బీజేపీ నాయకులు



కేంద్ర మంత్రితో బీజేపీ నాయకులు

యాదగిరిగుట్ట : యాదాద్రికి వచ్చిన కేంద్ర విద్యుత్, ఇంధన శాఖ మంత్రి ఆర్‌కే.సింగ్‌కు పట్టణం, మండలానికి చెందిన బీజేపీ నాయకులు శనివారం స్వాగతం పలికారు. అనంతరం పుష్పగుచ్ఛం అందజేసి సన్మానించారు. కలిసిన వారిలో పార్టీ జిల్లా అధ్యక్షుడు పాశం భాస్కర్, ప్రధాన కార్యదర్శి రాఘవుల నరేందర్, రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ రచ్చ శ్రీనివాస్, పట్టణ అధ్యక్షుడు భువనగిరి శ్యాంసుందర్, నాయకులు రంగ సత్యం, నంగునూరి భాను, బెలిదే అశోక్, భాస్కర్‌రెడ్డి తదితరులున్నారు.

పథకాలను సద్వినియోగం చేసుకోవాలి



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న అధికారిణి అన్నపూర్ణ, దివ్యాంగులు

భువనగిరిటౌన్ : దివ్యాంగులు సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా సంక్షేమ శాఖ ఇన్‌చార్జ్ అధికారిణి అన్నపూర్ణ అన్నారు. వికలాంగుల హక్కుల జాతీయ వేదిక ఆధ్వర్యంలో రూపొందించిన నూతన సంవత్సర క్యాలెండర్‌ను శనివారం ఆమె పట్టణంలోని జిల్లా సంక్షేమ శాఖ కార్యాలయంలో ఆవిష్కరించారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు సురూపంగా ప్రకాష్, జిల్లా ప్రధాన కార్యదర్శి వనం ఉపేందర్, మహిళా కన్వీనర్ కొత్త లలిత, గోపి ఉన్నారు.

బాలికల రక్షణపై అవగాహన



ర్యాలీ నిర్వహిస్తున్న మహిళా ప్రజాప్రతినిధులు

బీబీనగర్ : మండల కేంద్రంలో జిల్లా మహిళా శిశు, వికలాంగుల, వయోవృద్ధుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో శనివారం బాలికల రక్షణపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో బాలికల రక్షణ, బాల్య వివాహాలు, లింగ వివక్షత తదితర అంశాలపై వివరించి ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ గోళి ప్రణీతాపింగళ్‌రెడ్డి, సర్పంచ్ భాగ్యలక్ష్మీశ్రీనివాస్, ఉపసర్పంచ్ దస్తగిరి, మహిళా సాధికారిత బృందం నిఖిత, భార్గవి, మనీషా తదితరులు పాల్గొన్నారు.

వాణి శ్రీకాంత్‌రాజ్‌కు డాక్టరేట్



డాక్టరేట్ అందుకుంటున్న వాణిశ్రీకాంత్‌రాజ్

మోత్కూరు : తెలంగాణ ఉద్యమకారిని, ఆరాధ్య ఫౌండేషన్ చైర్మన్ తాడోజు వాణి శ్రీకాంత్‌రాజ్ డాక్టరేట్ అందుకున్నారు. ఆరాధ్య ఫౌండేషన్ ద్వారా చేస్తున్న సామాజిక సేవా కార్యక్రమాలను గుర్తించి శనివారం బేగంపేట మారిగోల్డ్ హోటల్‌లో న్యూ మాంక్స్ కుంగ్ ఫూ ఆర్గనైజేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో కౌన్సిల్ జనరల్ ఆఫ్ టర్కియల్మాన్ ఓర్హాన్ ఓఖాన్ చేతుల మీదుగా యునైటెడ్ థియోలాజికల్ రీసెర్చ్ యూనివర్సిటీ న్యూయార్క్ వారు ఆమెకు డాక్టరేట్ ప్రదానం చేశారు.

ప్రమాదాల నివారణపై అవగాహన



మాట్లాడుతున్న డీటీఓ రవీందర్

యాదగిరిగుట్ట : జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాలు-2024లో భాగంగా యాదగిరిగుట్ట ఆర్టీసీ డిపోలో డ్రైవర్లు, ఇతర ఉద్యోగులకు శనివారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డీటీఓ ఘంటా రవీందర్ పాల్గొని మాట్లాడారు. ప్రమాదాలు జరగకుండా ప్రతిఒక్కరూ జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. బస్సు నడిపే సమయంలో డ్రైవర్ సెల్‌ఫోన్ మాట్లాడొద్దని సూచించారు. ఈ సదస్సులో డిపో మేనేజర్ బి.శ్రీనివాస్, అసిస్టెంట్ ట్రాఫిక్ మేనేజర్ ఎం.హుస్సేన్, అసిస్టెంట్ ఇంజనీర్ హనుమానాయక్ ఉన్నారు.

స్టడీ మెటీరియల్ అందజేత

రామన్నపేట : మండల కేంద్రంలోని బాలికల పాఠశాల విద్యార్థులకు ఆసరా స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షుడు మేడి హరికృష్ణ శనివారం స్టడీ మెటీరియల్‌ను అందజేశారు. విద్యార్థులు కష్టపడి చదివి గురుకులాల్లో సీట్లు సాధించాలని ఆయన అన్నారు. కార్యక్రమంలో హెచ్ఎం పెద్దిరెడ్డి శంకర్‌రెడ్డి, ఉపాధ్యాయులు అండమ్మ, పి.భార్గవి, సంస్థ సభ్యులు గిరిబాబు, ఎల్లాచారి, శివసాయి, లింగస్వామి, సైదులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాల అమలుకు కృషి

భువనగిరిటౌన్ : కురుమ కులస్తులకు సంక్షేమ పథకాలు అందేలా కృషి చేస్తానని ప్రభుత్వం విప్ బీర్ల ఐలయ్య అన్నారు. శనివారం మున్సిపాలిటీ పరిధిలో రాయిగిరిలో కురుమ సంఘం ఆధ్వర్యంలో సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయనను కులస్తులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో యాదగిరిగుట్ట ఎంపీపీ చీర శ్రీశైలం, జెడ్పీటీసీ బీరుమల్లయ్య, తోటకూర అనురాధ, అన్ని మండలాల కురుమ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు పాల్గొన్నారు.

ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్యకు ఘన సన్మానం

రామన్నపేట : భువనగిరిలో ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్యను కుర్మ సంఘం మండల నాయకులు శనివారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనను శాలువాలతో సత్కరించి పుష్పగుచ్ఛం అందజేశారు. కార్యక్రమంలో పెద్దకురుమ మోటె లక్ష్మన్, ఈతాపుల రాజు, ఎంపీటీసీ గొరిగె నర్సింహ, బర్ల డేవిడ్, మోటె మల్లేష్, మిర్యాల మల్లేశం, లింగస్వామి, లింగయ్య పాల్గొన్నారు.



రామన్నపేట : ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్యను సన్మానిస్తున్న కురుమ సంఘం నాయకులు

అడ్డగూడూరు : భువనగిరిలో ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్యను శనివారం కురుమ సంఘం మండల నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనకు పుష్పగుచ్ఛం అందజేసి శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో బండి వెంకన్న, బండి యాదగిరి, కుమరస్వామి, సోమయ్య, కృష్ణమూర్తి, బీరప్ప పాల్గొన్నారు.

హోటళ్ల నిర్వాహకులపై చర్యలు తీసుకోవాలి

మోత్కూరు : నిబంధనలు పాటించకుండా హోటళ్లు నిర్వహిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని మున్సిపల్ కేంద్రంలో డిఫెన్స్ వినియోగదారుల హక్కుల సంఘం ఆధ్వర్యంలో శనివారం మున్సిపల్ కమిషనర్ సి.శ్రీకాంత్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సంఘం మండల అధ్యక్షుడు గిమిడెల్లి పరశురాములు మాట్లాడారు. మున్సిపల్ కేంద్రంలో హోటల్ యజమానులు వినియోగదారుడికి ఎలాంటి బిల్లులు ఇవ్వడం లేదని, వంటల తయారీలో వాడే ఆహార పదార్థాలు పిండి, వంటనూనె నాణ్యతగా లేదని, తినే ప్లేట్స్ శుభ్రంగా కడగడం లేదని, హోటల్ మాస్టర్స్ వంట చేసే సమయంలో పాటించాల్సిన పరిశుభ్రత, జాగ్రత్తలు తీసుకోవడం లేదని ఫిర్యాదులో పేర్కొన్నారు.



కమిషనర్ శ్రీకాంత్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

కార్యక్రమంలో డిఫెన్స్ వినియోగదారుల హక్కుల సంఘం ఉపాధ్యక్షుడు ఎర్రవెల్లి నాగేష్, కమిటీ సభ్యులు శివరాత్రి మత్స్యగిరి, ఇటికాల నరేష్, గుగ్గిళ్ల కృష్ణ, మర్రి కమల్నాథ్ పాల్గొన్నారు.

గీతకార్మికుల సంక్షేమానికి కృషి చేయాలి



క్యాలెండర్లను ఆవిష్కరిస్తున్న సంఘం నాయకులు

మోటకొండూర్ : ప్రభుత్వం కల్లుగీత కార్మికుల సంక్షేమానికి కృషి చేయాలని తెలంగాణ గీత పనివారల సంఘం రాష్ట్ర కార్యదర్శి బొలగాని సత్యనారాయణగౌడ్ డిమాండ్ చేశారు. శనివారం మండల కేంద్రంలో గౌడ సంఘం ఆధ్వర్యంలో రూపొందించిన క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. గ్రామాల్లో ప్రతి గౌడ సంఘానికి 10ఎకరాల భూమి, కల్లు విక్రయించుకునేందుకు 200గజాల స్థలం, గీత పనివారలకు నూతన ఐడీకార్డులు, ఎక్స్‌గ్రేషియా, పెన్షన్ పెంపు, వాహనాల అందజేత చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో గాజుల వెంకటేష్, తండ రాములు, గడ్డం అంజయ్య, గాదెగాని మాణిక్యం, లోడె యాదగిరి, వంగాల మల్లేష్, తాళ్లపల్లి వెంకటయ్య, గడ్డం జహంగీర్, బొలగాని జహంగీర్, సత్తయ్య, మల్లేశం తదితరులు ఉన్నారు.

సైబర్ నేరాలపై అవగాహన కలిగిఉండాలి

చౌటుప్పల్ : సైబర్ నేరాలపై విద్యార్థులు అవగాహన కలిగిఉండాలని సీఐ ఎస్.దేవేందర్ అన్నారు. శనివారం మండలంలోని కొయ్యలగూడెం జెడ్పీ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన అవగాహన సమావేశంలో ఆయన మాట్లాడారు. నేరగాళ్లు అత్యంత చాకచక్యంగా వ్యవహరిస్తుంటారని, అందుకనుగుణంగా ప్రజలు అవగాహన కలిగిఉండాలన్నారు. ఎలాంటి ఇబ్బందులు ఉన్నా పోలీస్‌శాఖతో పంచుకోవాలని విద్యార్థులకు సూచించారు. సెల్‌ఫోన్లు, ఆన్‌లైన్ ఆటలకు విద్యార్థులు దూరంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో ఉన్నత, ప్రాథమిక పాఠశాలల ఎస్ఎంసీ చైర్మన్‌లు కైరంకొండ అశోక్, వర్కాల రఘురాం, హెచ్ఎంలు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న సీఐ దేవేందర్

మున్సిపల్ కార్మికుల సమ్మె



సమ్మె చేస్తున్న మున్సిపల్ కార్మికులు

భూదాన్‌పోచంపల్లి : పెండింగ్ వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ మున్సిపల్ కార్మికులు స్థానిక మున్సిపల్ కార్యాలయం ఎదుట చేపట్టిన నిరవధిక సమ్మె శనివారం మూడో రోజుకు చేరింది. ఈ సందర్భంగా పలువురు కార్మికులు మాట్లాడుతూ.. జీతాలను ప్రతినెలా సకాలంలో చెల్లించాలన్నారు. వారికి సీఐటీయూ మండల కన్వీనర్ మంచాల మధు తదితరులు సంఘీభావం తెలిపారు. సమ్మెలో కార్మికులు కె.బాలయ్య, నరేశ్, ముత్తమ్మ, కిష్టయ్య, శంకర్, నిర్మల, సబిత పాల్గొన్నారు.

హైవేపై కొనసాగుతున్న రద్దీ

చౌటుప్పల్ : హైదరాబాద్ – విజయవాడ జాతీయ రహదారిపై శనివారం వాహనాల రద్దీ కొనసాగింది. సంక్రాంతి పండుగకు స్వగ్రామాలకు వెళ్లిన ప్రజానీకం తిరుగుప్రయాణం అవుతుండడంతో రద్దీ నెలకొంది. మధ్యాహ్నం దాటిన తర్వాత మొదలైన రద్దీ రాత్రి వరకు కొనసాగింది. దీనికి తోడు వీకెండ్ కావడంతో విజయవాడ మార్గంలోనూ వాహనాలు పెద్ద ఎత్తున రాకపోకలు సాగించాయి.



చౌటుప్పల్‌లో బారులుదీరిన వాహనాలు

అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

భూదాన్‌పోచంపల్లి : కేంద్రంలో ప్రధాని మోదీ చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు పాశం భాస్కర్ పిలుపునిచ్చారు. శనివారం పట్టణంలో నిర్వహించిన పార్టీ ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. వచ్చే పార్లమెంట్, పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో పార్టీ సత్తాచాటుతుందన్నారు. ఆ ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహాలపై చర్చించారు. అనంతరం విశ్వహిందూ పిలుపు మేరకు స్థానిక శ్రీ మహమ్మాయిదేవి దేవాలయం ఆవరణను శుభ్రం చేశారు. అనంతరం ఆయనకు నాయకులు శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు మేకల చొక్కారెడ్డి, అసెంబ్లీ కన్వీనర్ చిక్క కృష్ణ, పార్లమెంట్ కన్వీనర్ బందారపు లింగస్వామి, నోముల గణేశ్, గంజి బస్వలింగం, ఎర్ర లక్ష్మణ్, పంతంగి వినయ్‌కుమార్, రచ్చ సత్యనారాయణ, లింగస్వామి, పాండు, శ్రీశైలం, విజయ్‌పాల్గొన్నారు.



భూదాన్‌పోచంపల్లి : శ్రీమహమ్మాయిదేవి ఆలయ ఆవరణను శుభ్రం చేస్తున్న భాస్కర్



చౌటుప్పల్‌లోని శ్రీసీతారామచంద్రస్వామి ఆలయాన్ని శుభ్రం చేస్తున్న బీజేపీ నాయకులు

ఆకట్టుకున్న శ్రీరామమందిరం ముగ్గు

ఈనెల 22న అయోధ్యలో శ్రీరాముడి ప్రాణప్రతిష్టాపన మహోత్సవాలను పురస్కరించుకొని పట్టణ కేంద్రంలోని మాధవనగర్‌కు చెందిన కలకుంట్ల సౌమ్య శనివారం శ్రీరామమందిరం ముగ్గు చిత్రాన్ని రూపొందించింది తన భక్తిభావాన్ని చాటింది. మందిరం, వాటిపైన జెండాలు, జై శ్రీరాం రాస్తూ తీర్చిదిద్దిన ముగ్గు చూపరులను ఆకట్టుకుంటుంది.

బీజేపీ ఆధ్వర్యంలో ఆలయాలు శుభ్రం

వలిగొండ : మండల కేంద్రంలోని శ్రీసీతారామాంజనేయ ఆలయంతో పాటు మండలంలోని దాసిరెడ్డిగూడెంలో గల శ్రీసీతారామచంద్ర స్వామి ఆలయాన్ని అయోధ్యలో శ్రీరాముడి విగ్రహ ప్రతిష్టాపన సందర్భంగా శనివారం బీజేపీ నాయకులు శుభ్రం చేశారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు రంగాచార్యులు, పరిపూర్ణాచారి, దంతూరి సత్తయ్య, బుంగమట్ల కిష్టయ్య, గోద శ్రీనివాస్, అమరేందర్, రాములు, శంకరయ్య, బొడిగ ఐలయ్య, లింగస్వామి, చంద్రయ్య, కృష్ణయ్య పాల్గొన్నారు.

వేడుకలను ఘనంగా జరుపుకోవాలి

చౌటుప్పల్ : అయోధ్యలోని రామమందిరంలో జరుగుతున్న శ్రీరాముడి విగ్రహ ప్రాణప్రతిష్ఠ వేడుకలను ప్రజలంతా ఘనంగా జరుపుకోవాలని టెలికాం అడ్వయిజరీ బోర్డు సభ్యుడు రమనగోని శంకర్ అన్నారు. విగ్రహ ప్రతిష్ఠాపన వేడుకలను పురస్కరించుకొని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పిలుపు మేరకు శనివారం పట్టణ కేంద్రంలోని రామాలయంలో స్వచ్ఛశుద్ధి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఈనెల 22 ప్రతి ఇంట్లో దీపాలు వెలిగించి భాగస్వాములు కావాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ ఫ్లోర్‌లీడర్ పోలోజు శ్రీధర్‌బాబు, బీజేపీ పట్టణ అధ్యక్షుడు ఊడుగు వెంకటేశం, మండల ఇన్‌చార్జ్ గుజ్జుల సురేందర్‌రెడ్డి, నాయకులు దాసోజు భిక్షమాచారి, కాసుల వెంకటేశం, కంచర్ల గోవర్ధన్‌రెడ్డి, ఎల్లంకి పాండు, రాజపేట అశోక్, గోశిక పురుషోత్తం, కృష్ణ, రవి, సురేష్, రమ్య, దుర్గయ్య పాల్గొన్నారు. అదే విధంగా స్థానిక మార్కండేయస్వామి దేవాలయంలోనూ స్వచ్ఛ శుద్ధి నిర్వహించారు. కార్యక్రమంలో కౌన్సిలర్ పోలోజు శ్రీధర్‌బాబు, ఆలయ అధ్యక్షుడు గోశిక నర్సింహ, ప్రధాన కార్యదర్శి గోశిక భావనాఋషి, గంజి వెంకటేశం, బడుగు సుజాత, నర్సింహ, రాజు, రామకృష్ణ, యాదగిరి ఉన్నారు.



ఆత్మకూరు(ఎం)లో శ్రీరామ ఆకృతిలో కూర్చున బ్రిలియంట్ స్కూల్ విద్యార్థులు

సీతారాముల కల్యాణానికి ఏర్పాట్లు

ఆత్మకూరు(ఎం) : ఈనెల 22న అయోధ్యలో రామమందిరం ప్రారంభోత్సవం సందర్భంగా మండల కేంద్రంలోని శ్రీరామలింగేశ్వరస్వామి దేవస్థానంలో శ్రీసీతారాముల వారి కల్యాణం నిర్వహించడానికి శనివారం సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ కల్యాణంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు. సమావేశంలో మాజీ జెడ్పీటీసీ పి.పూర్ణచందర్‌రాజు, మాజీ సర్పంచ్ బీసు చందర్ గౌడ్, నాయకులు బండారు సత్యనారాయణ, గజరాజు కాశీనాథ్, గందె సత్యనారాయణ, వెంకటయ్య, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

శ్రీరామ ఆకృతిలో విద్యార్థులు

ఈనెల 22న అయోధ్యలో రామాలయం ప్రారంభోత్సవాన్ని పురస్కరించుకుని మండల కేంద్రంలోని బ్రిలియంట్ టాలెంట్ స్కూల్ విద్యార్థులు శనివారం శ్రీరామ్ ఆకృతిలో కూర్చుని ఆకట్టుకున్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ పి.పావని, కోటేశ్వరి, సిబ్బంది పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

23న చర్చా గోష్టిని జయప్రదం చేయాలి

భువనగిరిటౌన్ : పట్టణంలోని వక్ఫ్‌భూముల సమస్యలపై ఆవాజ్ ఆధ్వర్యంలో ఈనెల 23న నిర్వహించే జిల్లా స్థాయి చర్చా గోష్టిని జయప్రదం చేయాలని ఆవాజ్ కమిటీ జిల్లా అధ్యక్షుడు ఎంఏ ఇక్బాల్ ఆవాజ్ అన్నారు. శనివారం అందుకు సంబంధించిన కరపత్రాన్ని విడుదల చేశారు.

దరఖాస్తు గడువు పొడిగింపు

భువనగిరి : పట్టణంలోని సాంఘీక సంక్షేమ గురుకుల పాఠశాలలో 2024-25 విద్యా సంవత్సరంలో 5వ తరగతిలో ప్రవేశాలకు దరఖాస్తు గడువు ఈనెల 23 వరకు పొడిగించినట్లు గురుకుల పాఠశాల ప్రిన్సిపల్ శ్రీరాం శ్రీనివాస్ శనివారం తెలిపారు.

దరఖాస్తుల ఆహ్వానం

సంస్థాన్ నారాయణపురం : మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాలలో 6నుంచి 10వ తరగతి ప్రవేశాలకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు ఆహ్వానిస్తున్నట్లు పాఠశాల ప్రిన్సిపాల్ అశ్వీరాధం శనివారం తెలిపారు. ఫిబ్రవరి 22వరకు దరఖాస్తు గడువు ఉందని, ఏప్రిల్ 7న ప్రవేశపరీక్ష నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.

బీమా చెక్కుల పంపిణీ

వలిగొండ : మండలంలోని నాగారం గ్రామానికి చెందిన బోడ అంజయ్య జంగమ్మ దంపతులు ఇటీవల విద్యుదాఘాతంతో మృతి చెందారు. దీంతో వారు బీఆర్ఎస్ పార్టీ సభ్యత్వం కలిగిఉండడంతో పార్టీ నుంచి ఒక్కొక్కరికి మంజూరైన బీమా రూ.2లక్షల చెక్కును శనివారం మాజీ ఎమ్మెల్యే పైళ్ల శేఖర్ రెడ్డి మృతుల కుటుంబ సభ్యులకు అందజేశారు.

షార్ట్‌సర్క్యూట్‌తో ఇంట్లో సామగ్రి దగ్ధం

సంస్థాన్ నారాయణపురం : మండల కేంద్రంలోని రాపర్తి పెంటయ్య ఇంట్లో శనివారం ప్రమాదవశాత్తు విద్యుత్ షార్ట్‌సర్క్యూట్ జరగడంతో ఇంట్లోని వస్తువులు, నగదు కాలిపోయాయి. ఇంట్లో ఎవరు లేకపోవడం పెనుప్రమాదం తప్పినట్లయ్యింది. ఇంట్లోని ఫ్రిజ్, బీరువా, రూ.20వేల నగదు పూర్తిగా కాలిపోయినట్లు బాధితుడు తెలిపారు.

అధికారుల సర్వే

యాదగిరిగుట్ట రూరల్ : అక్రమంగా భవన నిర్మాణం చేపట్టాడని మండలంలోని మల్లాపురంలో గ్రామ సర్పంచ్ కర్రె వెంకటయ్యపై ఆ గ్రామ మాజీ సర్పంచ్ మంగ సత్యనారాయణ ఇటీవల కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. దీంతో శనివారం రెవెన్యూ, మండల పరిషత్ అధికారులు కలిసి భవన నిర్మాణం చేపట్టిన స్థలంలో సర్వే నిర్వహించారు. కార్యక్రమంలో తహసీల్దార్ వెంకటేశ్వర్లు ఎంపీఓ చంద్రశేఖర్, ఆర్ఐ, సర్వేయర్‌లు, కార్యదర్శి పాల్గొన్నారు.

ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో శ్రమదానం

భువనగిరి రూరల్ : మండలంలోని బస్వాపురం గ్రామంలో ఎలిమినేటి లక్ష్మమ్మ నర్సారెడ్డి స్మారక ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల విద్యార్థినులు ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో గ్రామంలో శ్రమదానం చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ నరాల నిర్మలవెంకటస్వామి, అధ్యాపకులు మల్లీశ్వరి, నాగమణి, విద్యార్థులు పాల్గొన్నారు.

పిల్లలపై తల్లిదండ్రులు దృష్టి సారించాలి

తుర్కపల్లి : పిల్లల చదువుపై తల్లిదండ్రులు దృష్టి సారించాలని హెచ్ఎం మంజుల అన్నారు. శనివారం మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలలో విద్యార్థుల తల్లిదండ్రులతో టీచర్ వర్ చేంజ్ అనే కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం బాలల దినోత్సవం సందర్భంగా గెలుపొందిన విద్యార్థులకు తల్లిదండ్రుల చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

గ్యాస్ కోసం బారులు

బీబీనగర్ : వంటగ్యాస్ కొరత ఏర్పడడంతో మండల కేంద్రంలో శనివారం భారత్ గ్యాస్ గోదాం వద్ద వినియోగదారులు బారులుదీరారు. గ్యాస్ లారీ సకాలంలో రాకపోవడంతో ఉదయం నుంచి సాయంత్రం వరకు ఉండి తీసుకెళ్లారు.



కాంగ్రెస్ ఎస్సీసెల్ జిల్లా వైస్‌చైర్మన్‌గా సురేష్



నియామక పత్రం అందజేస్తున్న హరిప్రసాద్

భువనగిరిటౌన్ : పట్టణానికి చెందిన తొర్రి సురేష్‌ను కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ జిల్లా వైస్‌చైర్మన్‌గా నియమిస్తూ శనివారం ఆ పార్టీ ఎస్సీసెల్ జిల్లా చైర్మన్ దర్గాయి హరిప్రసాద్ ఉత్తర్వులు జారీ చేశారు. కార్యక్రమంలో పీసీసీ నాయకులు ఏగూరి ఉదయ్‌కుమార్, కాంగ్రెస్ పట్టణ ఉపాధ్యక్షుడు పోకల యాదగిరి, నాయకులు మహంకాళి సురేష్, రెంటాల ప్రవీణ్, సాయికుమార్ పాల్గొన్నారు.

మాలమహానాడు జిల్లా ప్రధాన కార్యదర్శిగా అనిల్

అడ్డగూడూరు : మండలంలోని కంచనపల్లి గ్రామానికి చెందిన చేపూరి అనిల్ మాలమహానాడు జిల్లా ప్రధాన కార్యదర్శిగా శనివారం ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా అనిల్‌కు సంఘం జిల్లా అధ్యక్షుడు మెట్టు హరి నియామక పత్రం అందజేశారు. కార్యక్రమంలో లతీఫ్, ఆంధ్రయ్య, కరుణాకర్, కృష్ణయ్య, సుధాకర్, అంజయ్య ఉన్నారు.

ఎన్ఎస్‌యూఐ మండల అధ్యక్షుడిగా శ్రీనివాస్

మోత్కూరు : పట్టణంలోని సుందరయ్యకాలనీకి చెందిన నిమ్మల శ్రీనివాస్‌యాదవ్‌ను ఎన్ఎస్‌యూఐ మండల అధ్యక్షుడిగా నియమిస్తూ ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు కందుకూరి అంబేద్కర్ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు.

ఎమ్మార్పీఎస్ కన్వీనర్‌గా ప్రమోద్

గుండాల : మండల కేంద్రంలో శనివారం ఎమ్మార్పీఎస్ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో ఎమ్మార్పీఎస్ మండల కన్వీనర్‌గా పెద్దపడిశాల గ్రామానికి చెందిన ఉపసర్పంచ్ బందెల ప్రమోద్‌ను ఎన్నుకున్నారు. అనంతరం అతడికి నియామక పత్రం అందజేశారు.